# వ్యసనం

"అమ్మా వంటయిందే?" అడిగాడు మల్లేశ్.

"ఇంకా యాడ బిడ్డే, ఇన్నూరు బీడీలయితే హజార(వేయి)యితయి. అవి కాంగనె బియ్యం ఎసరుపెట్టి పెసరపప్పుల రెండు టమాటలేసి అండితే ఐపోతది."

"పనికెల్లి ఆకలితోటచ్చిన నాస్త గూడ లేకపాయె చాయి నీల్లతోని ఎంత సేపుండాలె?"

"ఇయ్యల్లంటె లేకపోయె గాని రోజు నాస్త పెట్టనా బిడ్డే? ఎదురింటి రుక్మవ్వను ఆస్పిటల్ల ఏసింద్రంటే సూసెతందుకు పోయిన, అందుకని అంట గాలె, ఒక గంటసేపాగితే అంట జేసి అడ్డిస్త"

"నేను దారం గట్టల్నా? బీడీలు జల్దయితయి"

"మా అయ్య! ఇరువై నాలుగేండ్లచ్చి, ఆఫీసుల పంజేసె నువ్వు బీడీలకు దారం గడుతవా? సిన్నప్పటి నుంచి పడ్డ తిప్పలు సాలయే?" భూదెవ్వ మాటల్లో కొడుకు పట్ల మమకారం ప్రస్ఫుటమైంది.

"ఎంత పెద్ద పెరిగినా నీ కొడుకునే గదా? ఆఫీసుల అరాంగ పంక కింద కూసుండి పనిజేసెటోన్ని నాకు తిప్పలేంది? గంటసేపు బీడీలకు దారం గడితె అరిగిపోతనా కరిగిపోతనా?"

"నువ్వు అరిగిపోవు గాని, అయిశి కొడుకుతోని బీడీల దారం కట్టిపిచ్చుకుంటె మందే మంటరు? ఎంత? ఇంక అద్ద గంటయితే బీడీలయితయి. అవి గాంగనె వంట జేస్త అంతదాక ఏదన్న పుస్తకం సదుకో"

భూదెవ్వ, మల్లేశ్ కార్మికవాసమైన ఖేడ్ గల్లీలో ఉంటారు. బొంబాయిలోని కొన్ని పెద్ద బట్టల మిల్లులకు దగ్గరలో ఉన్న చోటది. అబ్దుల్‌గని పత్రాచాల్ అనే ఆ గుడిసెల సమూహంలో దాదాపు రెండు వందల తెలుగు కుటుంబాలు స్థావర మేర్పరచుకున్నాయి.

మగవారు మిల్లులో పనిచేస్తే ఆడవారు, పిల్లలు బీడీలు చుట్టి చన్నీళ్లకు నేన్నీళ్లలా తోడై ఈ బొంబాయి మహా నగరంలో నిలదొక్కుకున్నారు. ఓ పత్రిక తెరచిన మల్లేశ్‌కు అక్షరాల స్థానంలో తన బాల్యం కదలాడింది.

తను అయిదో తరగతిలో ఉన్నప్పటి నుండి బీడీలకు దారం కట్టడం అలవాటయింది. అమ్మ తునికాకులో పొగాకు చుట్టి ఇస్తే, తను ఆ బీడీ దారం కట్టేవాడు. తను దారం కడితే గంటకు అయిదు వందల బీడీలు చేసేదమ్మ, లేకపోతే గంటకు మూడు వందలు కూడా అయేవి కావు.

అప్పుడు రోజుకు మూడు వేల బీడీలు చేసేది అమ్మ. నాన్నకు బట్టల మిల్లులో

పని. జీతం బాగానే వచ్చేది. తమకు తిండికి, బట్టకు లోటు లేకపోను, కాని ఊర్లో తాతయ్య చేసిన అప్పులు? వాటికి వడ్డీలు కట్టడానికే నాన్నగారి జీతం ఖర్చయ్యేది.

కొడుకు బొంబాయిలో పదహారు సాంచెలు (మగ్గాలు) నడిపించి బాగా సంపాదిస్తున్నాడని, లేని భేషజాలకు పోయి తన ఇద్దరు అత్తయ్యల పెళ్లి అట్టహాసంగా, ఆర్భాటంగా చేశారు తాతయ్య. మన పరిధిలో మన తాహతుకు తగ్గట్టుగా పెళ్లి చేద్దామని నాన్న ఎంత మొత్తుకున్నా వినలేదు. కట్న కానుకలకూ, లాంఛనాలకూ విందు భోజనాలు చేతికి ఎముక లేనట్టుగా ఖర్చు చేశాడు తాతయ్య. పెద్ద షామియానా, లైట్లు, లౌడ్ స్పీకరూ, బ్యాండు, సన్నాయిమేళం అన్ని హంగులతో చేసిన ఆ పెళ్లిళ్లు చూసి ఆహా! ఓహో! అన్నారంతా. దానికి తాతగారెంత పొంగిపోయారో?

ఆర్నెల్ల తర్వాత బాకీల వత్తిడితో గుండెపోటు వచ్చి కన్నుమూశాడు తాతయ్య. అప్పుడుగాని అసలు సంగతులు బయటపడలేదు. పుట్టెడు అప్పు దానికింద తనఖ పెట్టిన మూడు గదుల ఇల్లు, ఒక ఎకరం మెట్ట పొలం వారసత్వంగా వచ్చాయి నాన్నగారికి. నాలుగేండ్లు జీతం మొత్తం కేటాయించినా తీరని అప్పులు నెత్తిన పడ్డాయి.

భారీ కట్న కానుకలతో అత్తవారింటికి వెళ్లిన అత్తయ్యలు, చుట్టపుచూపుగా వచ్చి ముక్కు చీది కర్మకాండలు కాగానే వెళ్లిపోయారు. బొంబాయి రావడానికి సుముఖంగా లేని నానమ్మను చూసుకుంటామని మాటవరసకైనా అనలేదు. ప్రభుత్వం ఆడబిడ్డలకు ఆస్తి హక్కు కల్పించింది గాని, బాధ్యతల్లో, అప్పుల్లో కాదుగా?

నాన్నగారే ఓ పనిమనిషిని కుదిర్చి నానమ్మ ఆలనా, పాలనా అప్పగించారు. మరో మూణ్ణెల్లు తిరక్కుండానే తాతయ్యను వెదుక్కుంటూ వెళ్లింది నానమ్మ.

తను తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు విధి మరోసారి తమను వంచించింది.

పదహారు ఎలక్ట్రిక్ మగ్గాలు నడిపే నాన్న ఓ మెషిన్ నూలుపోగు సరిచేస్తుండగా వేరే మెషిను యొక్క కొక్కెం తగిలి అక్కడికక్కడే మరణించాడు. తమ పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. తాతయ్య బాపతు అప్పు ఇంకా తీరలేదు. కుటుంబ పోషణాభారం అమ్మపై బడింది. నాన్నగారి ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుయిటీ, ప్రమాద రాయితీ వీటన్నిటి నుండి చాలా మొత్తం అప్పులకే సరిపోయింది. మిగిలిన ఆ కొంత మొత్తం బ్యాంకులో వేసి వచ్చే వడ్డీతో, బీడీలు చేయగా వచ్చిన డబ్బుతో గుట్టుగా సంసారం నెట్టుకొచ్చింది అమ్మ. తనను డాక్టరో ఇంజనీయరో చేయాలని కలలుకన్న నాన్న అభీష్టం ఎలాగైనా పూర్తి చేస్తానని పట్టుపట్టింది అమ్మ. ఎంత కష్టపడైనా నన్ను చదివిస్తానని మొండికేసింది. తనకే అంత ఇష్టం లేకపోయింది. ఇంకా ఎన్ని రోజులు అమ్మను కష్టపెట్టడం? ఆ కోర్సుల్లో సీటు వచ్చినా, పూర్తి చేయడానికి నాలుగయిదేళ్లు పడుతుంది. వాటిలో చేరితే వేరే వ్యాపకానికో, పార్ట్ టైం పనిచేయడానికి అస్సలు కుదరదు. పూర్తి సమయం చదువుకే కేటాయించాలి. సంపాదనలో అమ్మకు సహాయపడటం తన విధి. కామర్సులో చేరితేగాని అది కుదరదు. ఎంతో ప్రయాసతో అమ్మను బతిమాలి, నచ్చజెప్పి కామర్సులో చేరాడు తను.

స్కూలు పిల్లలకు ట్యూషన్లు చెబుతూ తన ఖర్చులు వెళ్లదీసుకునేవాడు. టైపింగ్, షార్ట్‌హ్యాండ్ నేర్చుకుని పార్ట్‌టైం ఉద్యోగాలు చేశాడు. ఇంటరు పాసై పద్దెనిమిది సంవత్సరాల వయసు రాగానే ఉద్యోగం వేట మొదలయింది. తన గ్రాడ్యుయేషన్‌తో ఉద్యోగాన్వేషణ

కూడా ముగిసింది. ఓ ప్రభుత్వ సంస్థలో స్టెనోగ్రాఫర్‌గా ఎన్నికయ్యాడు. ప్రస్తుతం ప్రైవేటుగా ఎం.కాం. చేస్తున్నాడు.

"ఆకలైతుందన్నోడివి ఎంత సేపటి నుంచి పిలిచినా తినెతందుకు లేస్తలేవు?" అమ్మ అదలింపుతో వర్తమానంలోకి వచ్చి, భోజనానికి లేచాడు మల్లేశ్.

* * *

"ఇయ్యాల మల్ల రెన్నూరు బీడీలు చాటన్ (రిజెక్ట్) చేసింద్రు దూకాన్ల" భూదేవ్వతో అంది మల్లమ్మ.

"నాయి నన్నూరు బీడీలు పొట్టన వెట్టుకున్నడు ఆ మొద్దు మొకపోడు. బీడీలెంచుకునెతందుకు ఈ కొత్తోడచ్చిన్నుంచి, లేని సావున్నది. గుల్లకట్ట నూరు బీడీలు, చాటన్ నన్నూరు, ఇట్ల అయిదు నూరు బీడీలు ఆడి సావుకు తీసుకున్నడు. కైకిలి (కూలి) ఆకు పైసలగ్గాడ సాలకపాయె" భూదేవ్వ మాటలు మద్దెల, రోలు యాతనకు, తన బాధ జత చేసినట్టున్నాయి.

"ఆ ఆకులోల్లింట్ల పీనుగెల్ల, గా ఆకులు చెయ్యవట్టె గదా మన బీడీలు గింతగానం చాటనైతున్నై. శేటుకేం? అటు ఆకుల దుకాన్ల ఫాయిదానే (లాభమే) ఇటు బీడీల దుకాన్ల ఫాయిదనే, ˘నమే ఎటుగాకుండ అయితున్నం. శేటు మంచి ఆకు ఇస్తే బీడీలు మంచిగ రావా?" బ-లక్క అందుకుంది.

"మనదేశంల (ఊర్లో) కార్కానోల్లే ఆకు ఇచ్చి ముప్పై ఆర్రూపాల కూలి ఇత్తున్నరు. ప్రైవేట్ ఫండూ, పించిని కూడా ఇత్తున్నరు, ఈడ గూడా గట్ల ఇత్తే పడ్తలు (గిట్టుబాటు) పడుతది గదా?" మల్లమ్మ.

"నలుపై ఏండ్లాయె బీడీలు జేయవట్టి గింత అన్యాలం ఎప్పుడు లేదు. యాభై రూపాలు కూలన్నట్టే గాని, ఆకుకు దారం పోంగ ఇరువై రూపాలు మిగుల్తే బాగాయె" భూద్వెవ అందుకుంది.

"లాల్ బావుటోల్లు (కమ్యూనిస్టులు) యూనియన్ పెట్టిరి. మన దగ్గర పైసలు దీసిరి. ఆకు కార్కానోల్లే ఇయ్యాలె, ప్రైవేట్ ఫండ్, సర్వీసు దొరకాలె, అని సంపు జేపిచ్చిరి (సమ్మె చేయించిరి) అయినా ఏం గాకపోయె" బాలక్క అంది.

"శేట్లు యూనియనోల్లకు లంచమిచ్చిరి, ఆల్ల నోర్లు బందాయె. పైసతోని ప్రపంచమున్నది! మన దగ్గర మనమాట మాట్లాడి, శేట్ల దగ్గర ఆల్లమాట మాట్లాడిరి. మూడు రూపాలు కైకిలి పెంచి నెలరోజులు జేసిన సంపు (సమ్మె) వెనుకకు దీసుకునిరి. ఆకుల ధర పెంచి శేటు, యూనియనోల్లకిచ్చిన రూపాలు, పెంచిన కూలి, అడ్డి తోని వసూలు చేసుకునవట్టిరి. యూనియనోల్లే శేట్లమాటింటే మనకు దిక్కేది? అందరు గూడి మన రెక్కల కష్టం దోసుకుంటున్నరు" భూదేవ్వ అక్కసు వెళ్లగక్కింది.

"ఇయ్యాల రేపు ఫ్యాక్టరీల పని చేసేటోల్లకు యాభై రూపాల కూలి ఇత్తున్నరు. నాకైతే ఈ బీడీలు బందు జేసి ఫ్యాక్టరీలకు పనికిపోయింది మంచిగనుపిస్తున్నది" మల్లమ్మ అన్నది.

"ఫ్యాక్టరీలకు పోయేదుంటె ఎప్పుడో పోతుంటిమి. పోవుడచ్చుడు గంట. ఎనిమిది

గంటలు దాటి. దగ్గర దగ్గర పది గంటలు ఇంటి బయట ఉండాలె. ఈ బీడీలైతె ఇంటిపని జేస్కుంట మన ఆటమైనట్టు జేయవచ్చు. గందుకనే ఇవ్విట్లతో తండ్లాడుతున్నం" భూదెవ్వ అంది.

"కొడుకు నెలకు నాలుగు వేలు పగారు (జీతం) దెస్తున్నడు, నువు బీడీలు సేయకుంటె ఏమాయె ఆకులు కత్తిరియ్యాల, బీడీలు సెయ్యాల, అవి కార్ఖాన్ల కోయి ఇచ్చిరావాల. అల్లతోని మాటలు పడాల. అరువై ఏండ్లు మీద పడ్డె. ఇంకా నువ్వు తిరెం లేకుంట పని చేస్తె. గిట్లయితె తబ్బెతు (ఆరోగ్యం) కరాబు (పాడు)గాదా?" నలభై ఏండ్ల బాలక్క సానుభూతితో అంది.

"ఇప్పుడు నేను పైసల కొరకు పనిజేస్తున్ననుకుంటున్నరా? యేదో ఆ యెంకటేసుడి దయ తోటి మా మల్లేసుకు గౌర్మెంటు నౌకిరి దొర్కింది. పొట్టకు, బట్టకు అల్లారు (బెంగ) లేదు. రోజుకు మూడు నాలుగు వేలు బీడీలు జేసిన పానం ఉత్తగ ఉండుమంటె ఊకుంటదే? పొద్దుగల్ల తొమ్మిదేంగ మా వోడికి సద్ది గట్టిచ్చి పనికి తోలేసినంక నేనేం జేయాలె? ఎక్కువ లేకున్నా హజారు బీడీలు సేద్దమని సేత్తున్న. సేతుల పనుంటే అదో తీరు," భూదెవ్వ తన మనసు విప్పింది.

"కొడుకు పనికి పోయినంక బీడీలే చెయ్యాల్లా? మంచిగ తిని అరాం జేయరాదా? ఆల్లింటికి, ఈల్లింటికి పోయి, నాలుగు ముచ్చట్లు మాట్లాడితే పొద్దు గడువదే?" మల్లమ్మ నిలదీసింది.

"పని జేసిన సేతులు ఉత్తగ ఉండై. నలుపై ఏండ్ల నుంచి ఉన్న అలవాటు ఇప్పుడు పొమ్మంటే పోతదా? రోజు కల్లు తాగెటోడికి ఒక్కరోజు తాగకుంటె మనసున పట్టది. బీడీ, సిగరేటు పట్టెటోల్లకు అవి లేకుంటే తోయది. నాకు గూడా బీడీలు జేయకుంటె మనసు పట్టది. మీరందరూ బీడీలు జేయంగ నేను మీ దగ్గర కొచ్చి ముచ్చటాడల్లా? సుద్దులు, బీడీలు జేసుకుంట గూడ చెప్పుకోవచ్చు. ఏదో శాతనైనన్ని దినాలు తండ్లాడుత, కింద పడ్డంక నేను సేత్తనా? మీరు సూత్తరా?" కళ్ళలో నీళ్లు నిండగా భూదెవ్వ కంఠం గద్గదమైంది.

అంతలో మల్లేశ్ వచ్చాడు, ఆఫీసు నుండి. మల్లమ్మ, బాలక్క చేటలు ఆకుల ముల్లెలు తీసుకుని తమ తమ ఇండ్లకు బయలుదేరారు. కొంగుతో కళ్ళు తుడుచుకుని, కొడుక్కి టీ, టిఫన్ చేయదానికి లేచింది భూదెవ్వ. మలేశ్ స్నానం చేసేసరికి టిఫిను రెడీగా ఉంది.

"మల్ల ఏం యాదికచ్చింది? నేనచ్చెటల్లకు కండ్లు తుడుసుకుంటున్నె?" అడిగాడు మల్లేశ్.

గతం జ్ఞప్తికి తెచ్చుకుని దుఃఖ పడటం అలవాటే భూదెవ్వకు. గతం మరిచి హాయిగా ఉండమని మల్లేశ్ ఎంత పోరినా భూదెవ్వకది సాధ్యం కాలేదు.

"ఏం లేదురా బిడ్డా, బీడీలు బందు జేయమని ఎంట పడ్డరు మల్లమ్మ, బాలక్క మన పాత దినాలు యాది కచ్చి కండ్లకు నీల్లచ్చినై."

"నేను గూడ ఎన్నిసార్లు జెప్పిన బీడీలు చేసుడు బందుజేయుమని? నా మాట కదరు లేకపోతే నీ దోస్తుల మాటన్న ఇనరాదా?" మల్లేశ్ అన్నాడు.

"ఆడిన సేతులు ఉత్తగ ఉండై బిడ్డా. ఏం జెయ్యకుంట ఉత్తగుంటే, జరమచ్చినట్టనిపిస్తది. పానం ఉశారుండది. శాత గాకుంటైతే, నేనే బందుజేత్త. కోడలచ్చి నీకు పిల్లలు పుడ్తే, ఆల్లను ఆడిపిత్త. అప్పటిదాక నన్ను బీడీలు బందుజేయుమనకు. ఈ యాడాదన్న లగ్గం జేసుకుంటవా లేదా? ఈ దీలె (దీపావళి)కు ఇరువై ఐదేండ్లు పడుతై" భూదెవ్వకు అదను దొరికింది.

"అటీటుపోయి నువ్వు నా లగ్గం మాట తీసుకత్తౌ. నా సదువయేదాక లగ్గం జేసుకోను" మల్లేశ్ చిటపటలాడారు.

"బీ.కామాయె. పని మీదెక్కితివి. ఇంక సదేంటికి నాకు తెలకదుగుతా? భూదెవ్వ నిలదీసింది.

"ఈ వయసుల సదుకుంటేనే ముందట పనికొస్తది. పెద్ద పని దొర్కుతది. లగ్గమైనంక సదుదు అయితదా? పెద్ద పని దొర్కుతదా? లగ్గం జేసుకుని పెండ్లంను గీ జోపిడి (గుడిసె)లకు తీసుకురావాల్నా? కొన్ని పైసలు జమైనంక, ఆఫీసు నుంచి లోను తీసుకుని బైటూర్ల ఫ్లాటు దీసుకుంట. గప్పుడు లగ్గం జేసుకుంట" మల్లేశ్ కరాఖండిగా చెప్పాడు.

"ఫ్లాటు తీసుకునే దాకా లగ్గం జేసుకోనంటే ఎట్ల? మనిల్లు కేమైంది? నలుపై ఏండ్లాయె ఈడ ఉండవట్టి. నీ తోటోల్లు లగ్గం జేసుకోలేదా? ఈడ ఉంటలేరా?"

"నాతోటోల్ల సంగతి చెప్పకు. ఆల్లంటె సదుకోలేదు. ఆల్లకు తెలది. నేను ఆఫీసుల నా తోటోల్లను సూత్తున్న. ఆల్లను ఇంట్లకు తెచ్చేంతందుకు కూడా నాకు శరమనిపిస్తది. అందుకనే మంచిగ చదివి పెద్దపని మీదెక్కుతాననంటున్న."

"నీకు సిన్నప్పట్నుంటే సదువు సోకు. ఎన్నడైన నీతోటోల్లతోన్ని గోటీలాడినవా? బొంగురాలాడినవా? ఎప్పుడు జూసినా సేతుల పుస్తకమే నాయే! ఇప్పుడేమో పెద్దపని దొరికెతందుకు సదువుతున్నౌ. నాకు బీడీలు అలావాటైనట్టు నీకు సదువు అలువాటైంది. అదే మంచిది. పనిలనే పరమేసుదున్నడు. ఈమాట యాదిమరకు. ఇప్పుదు కష్టపడితేనే తర్వాత సుకం దొర్కుతది."

సంతకం చేయడం కూడా చేతగాని అమ్మలో ఓ కర్మయోగిని చూశాడు మల్లేశ్.

ఎప్పుడూ ఏదో ఓ పనిచేసే అమ్మ. ఇరుగు పొరుగువారికి సహాయం చేసే అమ్మ. ఇరుగు పొరుగువారి కష్టాల్లో పాలు పంచుకునేవారికి తన అమ్మ. చేతనైన సహాయం చేసే అమ్మ. కష్టాలతో కుంగిపోక ఏటికి ఎదురీదే అమ్మ. క్షణం తీరిక ఎరుగని అమ్మ తన ఆదర్శం. ప్రత్యక్ష దైవం!

కళ్ళలో ఆనందబాష్పాలు కదలాడగా, అమ్మే కాదు, ఆ పరలోక దేవత కూడా అతన్ని ఆశీర్వదించింది.

**(నేటినిజం)**